క్లుప్తంగా

సైదాపురంలో పోలింగ్ కేంద్రాల పరిశీలన



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్

సైదాపురం: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు ఏర్పాటు చేయనున్న పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ విజయలక్ష్మి బుధవారం పరిశీలించారు. ఈ నెల 13వ తేదీ జరిగే ఎమ్మెల్సీ ఎన్నికలను ప్రశాంతంగా జరిగేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఆమె వెంట ఆర్ఐ నారాయణ, వీఆర్వో హజరత్తయ్య ఉన్నారు.

కండలేరును సందర్శించిన ఎస్ఈ

రాపూరు: కండలేరు జలాశయం వద్ద జరుగుతున్న పనులను ఎస్ఈ శివ కుమార్‌రెడ్డి బుధవారం పరిశీలించారు. ఆయన వెంట ఈఈలు విజయ భాస్కర్, శేషుబాబు, డీఈలు శ్రీనివాసులురెడ్డి, సత్యనారాయణ, విజయకుమార్‌రెడ్డి, సుధాకర్, ఏఈలు ఉన్నారు.

డీవీసత్రం పాఠశాల తనిఖీ

దొరవారిసత్రం: స్థానిక ప్రాథమిక పాఠశాలను ఎంఈఓ మస్తానయ్య బుధవారం తనిఖీ చేశారు. పలు రికార్డులు, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. అనంతరం విద్యార్థుల సామర్థ్యాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట హెచ్‌ఎం దామోదరం ఉన్నారు.

విద్యార్థుల సామర్థ్య పరిశీలన



విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలిస్తున్న ఎంఈఓ

దక్కిలి: మండలంలోని నాయుడుపాళెం ప్రాథమిక పాఠశాలను ఎంఈఓ వెంకటేశ్వర్లు బుధవారం సందర్శించారు. విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. విద్యార్థుల హాజరు, రికార్డులను తనిఖీ చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే పిల్లలు చదివేలా తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని సూచించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం పెట్టాలన్నారు. ఆయన వెంట హెచ్‌ఎం జయచంద్ర ఉన్నారు.

నేటి నుంచి అలఘునాథుని బ్రహ్మోత్సవాలు

గూడూరు: పట్టణంలోని అలఘునాథస్వామి ఆలయంలో గురువారం నుంచి బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ అర్చకుడు పరాంకుశం అశోక్ తెలిపారు. గురువారం ఉదయం పంచామృతాభిషేకం, అంకురార్పణతో మొదలై, ఈ నెల 12వ తేదీ ఆదివారం ఉదయం లక్ష తులసి పూజతో ఉత్సవాలు ముగుస్తాయని తెలిపారు

రాజేష్‌కు పితృవియోగం

నాయుడుపేటటౌన్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు, కిలివేటి సంజీవయ్య యువసేన అధ్యక్షుడు పొట్లాపూడి రాజేష్‌కు పితృవియోగం కలిగింది. ఆయన తండ్రి పి.జయప్రసాద్ రావు (జయన్న–65) బుధవారం ఆకస్మిక మృతిచెందారు. మున్సిపల్ చైర్‌పర్సన్ కటకం దీపిక, ట్రేడ్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి కట్టా వెంకట రమణారెడ్డి, పార్టీ మండల కన్వీనర్ తంబిరెడ్డి సుబ్రహ్మణ్యం రెడ్డి నివాళులర్పించారు.

హోంగార్డుకి నివాళి



మునుస్వామి మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఎస్‌ఐలు

తడ: అనారోగ్యంతో నెల్లూరు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందిన హోంగార్డు వల్లం మునుస్వామి(48)కి సూళ్లూరుపేట సర్కిల్ పరిధిలోని పోలీస్ సిబ్బంది బుధవారం నివాళులర్పించారు. సూళ్లూరుపేట సర్కిల్ పరిధిలోని తడ, సూళ్లూరుపేట, శ్రీహరికోట పోలీస్ స్టేషన్ ఎస్‌ఐలు జేపీ శ్రీనివాసరెడ్డి, పీ రవిబాబు, మనోజ్‌కుమార్ ఇతర సిబ్బంది మృతుని స్వగ్రామం కాదలూరుకి చేరుకుని మృతదేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. 22 ఏళ్లపాటు సర్కిల్ పరిధిలో పలువురు, ఎస్‌ఐలు, సీఐలకు జీప్ డ్రైవర్‌గా మునుస్వామి అందించిన సేవలు మరువలేనివని కొనియాడారు.

అభాగ్యురాలికి అంతిమ సంస్కారం



శ్మశానానికి తరలిస్తూ..

సైదాపురం: అనారోగ్యంతో మరణించిన అభాగ్యురాలికి పీపీఎఫ్ సభ్యులు ఆత్మ బంధువులై అంతిమ సంస్కారాలు నిర్వహించారు. మండలంలోరి కలిచేడు గ్రామంలో నిరుపేద కుటుంబానికి చెందిన కుంచం శేషమ్మ (65) గత కొంత కాలంగా క్యాన్సర్‌తో బాధపడుతుండేది. ఆమెకు ఎవరూ లేకపోవడంతో అనాథగానే జీవించింది. మంగళవారం రాత్రి స్వగ్రామమైన కలిచేడులో కన్నుమూసింది. ఆమెకు అంత్యక్రియల కోసం తరలించేందుకు ఎవరూ ముందుకు రాలేదు. ఈ సమాచారం అందుకున్న ఆ గ్రామానికి చెందిన పీపీఎఫ్ చైర్మన్ మీజూరు మల్లికార్జున వెంటనే స్పందించారు. పీపీఎఫ్ సభ్యులైన వల్లం సతీష్, కర్లపూడి స్టాలిన్ ఉచిత వైకుంఠ రథంతో ఆ గ్రామానికి చేరుకున్నారు. అనాథ వృద్ధ పార్థివ దేహానికి హిందూ సంప్రదాయ ప్రకారం పాడె కట్టి వైకుంఠ రథంపై పార్థివ దేహాన్ని ఊరేగింపుగా శ్మశానాన్ని తీసుకెళ్లి అంత్యక్రియలు చేశారు. ఆ అభాగ్యురాలికి పీపీఎఫ్ సభ్యులే ఆత్మ బంధువులై అంతిమ సంస్కారాలు నిర్వహించి, స్థానికుల నుంచి అభినందనలు అందుకున్నారు.

పోలీసన్న మానవత్వం



మానసిక దివ్యాంగుడికి దుస్తులు వేస్తున్న పోలీస్

గూడూరు: పట్టణంలోని పాత బస్టాండ్ కూడలి వద్ద మతిస్థిమితం లేని ఓ వ్యక్తి ఒంటిపై నూలుపోగు లేకుండా బుధవారం నడిచి వెళుతున్నాడు. ఎందరో చూశారు. మన కెందుకులే.. అయినా మనమేం చేస్తాం అనుకున్నారే తప్ప అతనికేం చేయాలని ఆలోచించలేదు. కానీ విధుల్లో ఉన్న ఒకటో పట్టణ హెడ్ కానిస్టేబుల్ ఎస్‌కే రిజ్వాన్ అలా అనుకోలేదు. అతన్ని చూసి చలించిపోయాడు. వెంటనే కానిస్టేబుల్ శీను, హోంగార్డు భాస్కర్ ద్వారా తన సొంత డబ్బుతో లుంగీ, షర్టు తెప్పించి దుస్తులు వేశారు. భోజనం పెట్టి మానవత్వాన్ని చాటుకున్నారు.

ప్రజారోగ్యానికి అధిక ప్రాధాన్యం

–ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు

గూడూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల ఆరోగ్యానికి పెద్ద పీట వేస్తున్నారని ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు అన్నారు. పట్టణంలోని ఎమ్మెల్యే నివాసంలో రూరల్ మండలం మేగనూరు గ్రామానికి చెందిన సంపూర్ణమ్మకు రూ.1.10 లక్షల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును పార్టీ నాయకులతో కలిసి ఆయన అందజేశారు. సీఎం పేదల ఆరోగ్యానికి ప్రాధాన్యతనిస్తూ, ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారన్నారు. మన రాష్ట్రంలోనే కాకుండా, తమిళనాడు, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల్లోని కార్పొరేట్ ఆస్పత్రుల్లో వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ఉచిత వైద్యం అందజేసేలా చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. వందల సంఖ్యలో 108 వాహనాలను, ప్రభుత్వ ఆస్పత్రుల్లో మౌళిక వసతులు కల్పించారన్నారు. మందుల కొరత లేకుండా చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు.

వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించండి



వైఎస్సార్‌సీపీ అభ్యర్థులకు ఓటు వేయాలని కోరుతున్న ఎమ్మెల్యే సంజీవయ్య

సూళ్లూరుపేట రూరల్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బలపరచిన పట్టభద్ర, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థులైన పేర్నాటి శ్యామ్‌ప్రసాద్ రెడ్డి, పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డిని గెలిపించాలని సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య ఓటర్లను అభ్యర్థించారు. మండలంలోని గొల్లపాళెంలో ఉన్న పట్టభద్రులను బుధవారం కలసి వారితో మాట్లాడారు. మొదటి ప్రాధాన్యత ఓటు పేర్నాటి, పర్వతరెడ్డికి వేసి గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమాల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉన్నారు.

ప్రైవేటుకు దీటుగా ఉత్తీర్ణత సాధించాలి



పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈఓ శేఖర్

నాయుడుపేటటౌన్: ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తీర్ణత సాధించాలని తిరుపతి జిల్లా విద్యాశాఖ అధికారి వి.శేఖర్ ఉపాధ్యాయులకు సూచించారు. పట్టణంలోని ఎల్ఏ సాగరం ఉన్నత పాఠశాలను బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. డీఈఓ ఉపాధ్యాయులతో మాట్లాడుతూ డిజిటల్ విద్య బోధనలపై ప్రత్యేక శ్రద్ధ వహించి విద్యార్థులకు అవగాహన కల్పించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ముఖ్యంగా సి గ్రేడ్ విద్యార్థులకు అన్ని సబ్జెక్టుల్లో తర్ఫీదు ఇవ్వాలన్నారు. అనంతరం 10 తరగతి విద్యార్థులతో మాట్లాడి పలు విషయాలను అడిగి తెలుసుకున్నారు. పబ్లిక్ పరీక్షల్లో నూటికి నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలని విద్యార్థులకు సూచించారు. పాఠశాల పరిసర ప్రాంతాలను పరిశీలించి డీఈఓ సంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాల హెచ్‌ఎం అన్నామణి, ఉపాధ్యాయులు ఉన్నారు.

2024 ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేద్దాం

- నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి



ఆత్మీయ సమావేశంలో ప్రసంగిస్తున్న రాంకుమార్ రెడ్డి

కలువాయి: 2024 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యంగా పనిచేద్దామని ఆ పార్టీ తిరుపతి జల్లా అధ్యక్షుడు, వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి అన్నారు. బుధవారం కలువాయిలో జరిగిన పార్టీ నియోజకవర్గ నాయకుల ఆత్మీయ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పార్టీలో అందరినీ కలుపుకుని నియోజకవర్గంలో పార్టీని పటిష్టం చేయడంతో పాటు, ముఖ్యమంత్రి ఆశయాల మేరకు పనిచేస్తామన్నారు. మార్చి 20వ తేదీ నుంచి నియోజకవర్గంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ఎమ్మెల్సీ మేరిగ మురళి మాట్లాడుతూ.. రాంకుమార్‌రెడ్డి సమన్వయకర్తగా బాధ్యతలు తీసుకోవడంతో వెంకటగిరి నియోజకవర్గంలోని పార్టీ క్యాడర్‌లో నూతన ఉత్సాహం కనిపిస్తోందన్నారు. అంతకు ముందు కలువాయమ్మ తల్లి ఆశీస్సులు తీసుకుని, పార్టీ కార్యాలయం నుంచి ర్యాలీగా సభా ప్రాంగణానికి వచ్చారు. కార్యక్రమంలో పెంచలకోన ట్రస్ట్ బోర్డు మాజీ చైర్మన్ నెల్లూరు రవీంద్రరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు అనిల్‌కుమార్ రెడ్డి, ఎంపీపీ లక్ష్మీదేవి, ఉపాధ్యక్షుడు పంగా పెంచలనరసారెడ్డి, సొసైటీ చైర్మన్ చల్లా సుబ్బరామిరెడ్డి, మండల కన్వీనర్ కృష్ణారెడ్డి, నాయకులు మాదాసు యజ్ఞ పవన్, చల్లా రఘురామిరెడ్డి పాల్గొన్నారు.

ఎన్‌బీకేఆర్ సంస్థలపై తప్పుడు కథనాలు సరికాదు

ఎన్‌బీకేఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో విద్యార్థులను బయటకు గెంటి వేస్తున్నారని, వేధిస్తున్నారని కొన్ని చానళ్లు, పత్రికలు తప్పుడు కథనాలు ప్రసారం చేస్తున్నాయని, వారికి లీగల్ నోటీసులు ఇస్తామని విద్యాసంస్థల చైర్మన్ నేదురుమల్లి రాంకుమార్ రెడ్డి తెలిపారు. ఎంతో పేరుప్రతిష్టలు కలిగిన సంస్థపై ఎలాంటి ఆధారాలు లేకుండా తప్పుడు కథనాలు ప్రసారం చేయడం తగదన్నారు. వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

పోలింగ్ కేంద్రాల వద్ద పకడ్బందీ చర్యలు



ఎన్నికల అధికారులకు సూచనలు చేస్తున్న జేసీ బాలాజి

నాయుడుపేటటౌన్: ఎమ్మెల్సీలకు సంబంధించి మార్చి 13న సూళ్లూరుపేట, గూడూరు డివిజన్‌ల పరిధిలో జరిగే ఎన్నికల పోలింగ్ కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని జాయింట్ కలెక్టర్ బాలాజి తెలిపారు. పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి బుధవారం నాయుడుపేట పట్టణంలోని కేకే కల్యాణ్ సదన్‌లో పీఏలు, ఏపీఓలకు శిక్షణ తరగతులను నిర్వహించారు. ఎన్నికలకు చేపట్టాల్సిన జాగ్రత్తలు తదితర విషయాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సూళ్లూరుపేట, గూడూరు ఆర్డీఓలు చంద్రముని, కిరణ్ కుమార్ మున్సిపల్ కమిషనర్లు శ్రీనివాసరావు, నరేంద్ర, డివిజన్ పరిధిలోని తహసీల్దార్లు పాల్గొన్నారు.

పెట్రోల్ బంకుల్లో తనిఖీలు



కలువాయి: ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కలువాయి తహసీలార్ సోమ్లానాయక్, సివిల్ సప్‌లెస్ డిప్యూటీ తహసీల్దార్ రవి కలువాయి మండలంలోని బాలాజీ, మొహమ్మద్ నియాస్, స్టార్ ఫిల్లింగ్ స్టేషన్లను బుధవారం తనిఖీ చేశారు. పెట్రోల్, డీజిల్ నాణ్యత, స్టాక్ పొజిషన్, కస్టమర్ల సౌలభ్యం, తాగునీరు, టాయిలెట్లు తదితర సౌకర్యాలను పరిశీలించారు.

పేదల సంక్షేమానికి జగనన్న పెద్దపీట



పింఛన్ల పంపిణీ ప్రారంభించిన చైర్‌పర్సన్ దీపిక

నాయుడుపేటటౌన్ : పేదలందరి సంక్షేమానికి సీఎం జగనన్న పెద్ద పీట వేస్తున్నారని మున్సిపల్ చైర్‌పర్సన్ కటకం దీపిక అన్నారు. పట్టణంలోని అగ్రహారపేటలో బుధవారం తొలిసారిగా సచివాలయ కన్వీనర్లు, గృహసారథులతో కలసి పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆమెతోపాటు వైస్ చైర్మన్ జలదంకి వెంకటకృష్ణా రెడ్డి, పట్టణ జేసీఎస్ కన్వీనర్ చదలవాడ కుమార్, వలంటీర్ల సహకారంతో పింఛన్లు అందజేశారు. కటకం దీపిక మాట్లాడుతూ ఏ రాష్ట్రంలో లేని విధంగా ప్రతి నెలా ఒకటో తేదీనే ఇంటి వద్దకే వెళ్లి పింఛన్లను అందిస్తున్న ఘనత తమ సీఎంకే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ పట్టణ అధ్యక్షులు కటకం జయరామయ్య, నాయకులు దారా రవి, తదితరులు ఉన్నారు.

ముందస్తు జాగ్రత్తలతో రక్తహీనత దూరం



వైద్యులతో మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

సైదాపురం/రాపూరు: గర్భిణులకు రక్తహీనత రాకుండా ఉండేందుకు వైద్యులు ముందస్తు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఇంటిగ్రేటెడ్ డిసీజెస్ సర్వేయల్ ప్రొగ్రాం అధికారి వెంకటేశ్వర్లు అన్నారు. సైదాపురం, రాపూరు, వేపినాపి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను బుధవారం ఆయన పరిశీలించారు. గర్భం దాల్చిన తర్వాత మహిళలకు ఉండాల్సిన రక్తశాతం క్షీణించకుండా ఎప్పటికప్పుడు పరీక్షలు నిర్వహించి పలు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పోషకాహారంపై వారికి అవగాహన కల్పించాలన్నారు. మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. వైద్యులు జనార్దన్‌రావు, శ్రావణి, సూర్యధర్మేంద్ర, గిరీష్, సీహెచ్‌ఎన్ హసీనా పాల్గొన్నారు.



నేడు వైఎస్సార్‌సీపీ కార్యకర్తల సమావేశం

వెంకటగిరిరూరల్(బాలాయపల్లి): బాలాయపల్లి మండలం జయంపులో గురువారం జరగనున్న వైఎస్సార్‌సీపీ విస్తృతస్థాయి సమావేశాన్ని జయప్రదం చేయాలని ఎంపీపీ గూడూరు భాస్కర్‌రెడ్డి, తిరుపతి జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు నెమళ్లపూడి సురేష్‌రెడ్డి కోరారు. వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు రాంకుమార్‌రెడ్డి కార్యకర్తలకు దిశానిర్దేశం చేయనున్నారని తెలిపారు. ఈ మేరకు బుధవారం ఏర్పాట్లను పరిశీలించారు.

మండల పరిషత్‌లో డీఎస్పీ విచారణ



విచారణ చేస్తున్న డీఎస్పీ సూర్యనారాయణరెడ్డి

చిల్లకూరు: మండల పరిషత్ కార్యాలయంలో ఇటీవల చోటు చేసుకున్న పలు పరిణామాలను దృష్టిలో ఉంచుకుని గూడూరు డీఎస్పీ సూర్యనారాయణరెడ్డి బుధవారం విచారణ చేశారు. ఇక్కడ నూతనంగా నిర్మించిన ఓ గదిని స్థానిక జెడ్పీటీసీ మన్నెం శీనయ్యకు కేటాయించారు. అయితే గత నెల కుర్చీపై గుర్తు తెలియని వారు మూత్ర విసర్జన చేయడంతో ఫిర్యాదు మేరకు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు. అలాగే కార్యాలయంలోని కొన్ని ఎంబుక్‌లు, రికార్డులు మాయం అయినట్లు ఫిర్యాదు అందడంతో డీఎస్పీ క్షేత్రస్థాయి విచారణకు వచ్చారు. ఆయన వెంట గూడూరు రూరల్ సీఐ దశరధరామారావు, చిల్లకూరు ఎస్ఐ గోపాల్ ఉన్నారు.

పింఛన్ల పంపిణీ



పింఛను అందిస్తున్న వలంటీర్

నాయుడుపేటటౌన్: నాయుడుపేట మున్సిపాలిటీ పరిధిలో బుధవారం సాయంత్రానికి 85 శాతం పింఛన్‌లను పంపిణీ చేసినట్లు కమిషనర్ శ్రీనివాసరావు తెలిపారు. మొత్తం 4,202లకు గాను 3,800 పంపిణీ చేశామన్నారు.

పెళ్లకూరు/ఓజిలి/ దొరవారిసత్రం: పెళ్లకూరు మండలంలో 98శాతం, ఓజిలి మండలంలో 91 శాతం, దొరవారిసత్రంలో 4,919 మందికి గాను 4,500 మందికి పింఛన్లు అందజేశారు.

కూలీలకు కనీసం 4 గంటల పని

దక్కిలి: ఉపాధిహామీ కూలీలకు రోజుకు కనీసం నాలుగు గంటల పాటు పని కల్పించాలని, కూలీల సంఖ్య పెంచాలని ఏపీఓ లక్ష్మీనారాయణ అన్నారు. స్థానిక ఉపాధిహామీ కార్యాలయంలో ఫీల్డ్ అసిస్టెంట్‌లు, టెక్నికల్ అసిస్టెంట్‌లతో బుధవారం సమావేశం నిర్వహించారు. మండలంలోని అన్ని గ్రామాల్లో 2,200 మందికి తగ్గకుండా 100 రోజుల పని కల్పించాలని అన్నారు. కనీసం రూ.257 వచ్చేలా పనులు చేయించాలన్నారు. గ్రామాల్లో అవసరమైన పనులు గుర్తించి ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు.

మైనార్టీలపై వివక్ష తగదు

గూడూరు: కేంద్ర ప్రభుత్వం మైనార్టీలపై వివక్షతతో వ్యవహరించడం తగదని మాజీ ఎంపీ, సీపీఐ జాతీయ కార్యదర్శి అజీజ్ అన్నారు. పాండిచ్చేరిలో సీపీఐ జాతీయ కార్యవర్గ సమావేశంలో పాల్గొని తిరిగి వెళ్తూ గూడూరు రైల్వే స్టేషన్‌లో ఇన్సాఫ్ కమిటీ సమితి సభ్యులు బుధవారం ఆయన్ను కలిశారు. ఆయన మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ నియంతృత్వ పాలన కొనసాగిస్తోందన్నారు. అదానీ, అంబానీ ఆస్తులను పెంచడమే లక్ష్యంగా బీజేపీ వ్యవహరిస్తోందని దుయ్యబట్టారు. జమాలుల్లా, చాన్‌బాషా, హైదర్ అలీ పాల్గొన్నారు.

వైభవంగా మహాకుంభాభిషేకం ప్రారంభం



పోలేరమ్మ ఆలయం వద్ద పూజలు చేస్తున్న ఆర్యవైశ్య సంఘ నాయకులు



ఆలయాల వద్ద హోమ పూజలు చేస్తున్న వేద పండితులు, భక్తులు

నాయుడుపేటటౌన్ : పట్టణంలోని వాసవీ కన్యకా పరమేశ్వరీదేవి ఆలయాల సముదాయంలోని అఖిలాండేశ్వరీ దేవి సమేత జంబుకేశ్వరస్వామి, కోదండ రామస్వామి, శ్రీకృష్ణ ఆలయాలకు మహాకుంభాభిషేక మహోత్సవాలను ప్రారంభించారు. ఆర్యవైశ్య సంఘ నాయకుల సారథ్యంలో వేదపండితులతో ఈ నెల 3వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు నిర్వహణ కమిటీ చైర్మన్ కనమర్లపూడి సుబ్రమణి, సోమిశెట్టి వెంకటేశ్వర్లు వెల్లడించారు. పట్టణంలోని గ్రామ దేవత పోలేరమ్మ ఆలయం వద్ద ఆర్యవైశ్య సంఘ గౌరవ అధ్యక్షులు పెనల జయ రాజగోపాల్, అధ్యక్షులు యచ్చా లక్ష్మీనారాయణ, కార్యదర్శి కోటా వెంకటేశ్వర్లు, సంఘ పెద్దలందరూ కలసి ప్రత్యేక పూజలను నిర్వహించి అక్కడి నుంచి ఆలయాల సముదాయం వద్దకు చేరుకుని కుంభాభిషేక హోమ పూజలను ప్రారంభించారు. యాగశాల వద్ద ప్రత్యేక పూజలు, 2వ తేదీ రాత్రి బెంగళూరు చెందిన ప్రఖ్యాత గాయనీమణులు వాసవీ సిస్టర్స్ భక్తి గీతాలాపన, 3 తేదీ రాత్రి నగరోత్సవంతో కుంభాభిషేక వేడుకలు ముగుస్తాయన్నారు.

నేరాల నియంత్రణకే విలేజ్ పోలీస్



గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్ఐ

చిల్లకూరు: ఎస్పీ పరమేశ్వరరెడ్డి ఆదేశాల మేరకు నేరాల నియంత్రణకు గ్రామానికి ఒక పోలీస్‌ను స్థానికుల్లో ఒకరిని నియమించేలా చర్యలు తీసుకుంటున్నట్లు ఎస్ఐ గోపాల్ తెలిపారు. మండలంలోని ఓడూరులో బుధవారం గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ఇప్పటికే ప్రతి సచివాలయం పరిధిలో ఒక మహిళా పోలీస్‌ను ప్రభుత్వం నియమించిందన్నారు. అదనంగా గ్రామానికి ఒక పోలీస్‌ను ఎంపిక చేస్తామన్నారు. నేరాల నియంత్రణకు పోలీసులకు సహకరించాలని కోరారు. సర్పంచ్ శారదమ్మ పాల్గొన్నారు.